క్లుప్తంగా

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు



కోటవురట్లలో ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు శిక్షణ ఇస్తున్న ఆర్పీలు

కోటవురట్ల: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు అల్లావుద్దీన్, కె.వి.లక్ష్మీనారాయణ, పి.యేసుదాసు ఆధ్వర్యంలో ఆర్పీలు వి.వి.అప్పారావు, జి.ఈశ్వరరావు శిక్షణ ఇచ్చారు. ఎస్‌ఎంసీ విధులు, అవలంబించాల్సిన అంశాలు, ప్రధానోపాధ్యాయుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి ఆహారాన్ని అందించేందుకు కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. అనంతరం ఎస్‌ఎంసీ వివరాలతో కరపత్రాలు పంపిణీ చేశారు.

దళితవాడలో తుప్పల తొలగింపు



తుప్పల తొలగింపు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: దళితవాడ అభ్యున్నతికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. అరబుపాలెం దళితవాడలో పేరుకుపోయిన తుప్పల తొలగింపుతో పాటు కాలువల్లో పూడిక తొలగింపు పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితవాడలో సమస్యల పరిష్కారానికి పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అధ్యాపకుడు చిట్టిబాబుకు ఏయూ డాక్టరేట్



ఏయూ అధికారుల నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న చిట్టిబాబు

యలమంచిలి రూరల్: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడు వనపర్తి చిట్టిబాబు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ డిగ్రీ పట్టా అందుకున్నారు. భారత జీవిత బీమా సంస్థ వ్యవస్థా సామర్థ్యంపై మానవ వనరుల నిర్వహణ ప్రభావం అనే అంశంపై ఏయూ కామర్స్ విభాగం ఆచార్యుడు పి.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో చిట్టిబాబు చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. చిట్టిబాబు డాక్టరేట్ పొందడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

పూరిల్లు దగ్ధం

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాకలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలో గొల్లవీధిలో పంచదార్ల వెంకటరమణకు చెందిన పూరింట్లో వంట చేస్తున్న సమయంలో కట్టెల పొయ్యి నుంచి నిప్పురవ్వలు ఎగిరి తాటికమ్మలపై పడ్డాయి. దీంతో మంటలు వ్యాప్తి చెందాయి. సమాచారం అందుకున్న యలమంచిలి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ప్రమాద స్థలానికి శకటంతో వెళ్లి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.75 వేల ఆస్తి నష్టం వాటిల్లగా.. సుమారు రూ.1.25 లక్షల విలువైన ఆస్తిని కాపాడినట్టు అగ్నిమాపక కేంద్రం అధికారి రాంబాబు తెలిపారు.

మూలపేట అభివృద్ధికి సహకరించాలి

మునగపాక: మూలపేట గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సదుపాయంతో పాటు పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. పంచాయతీ కార్యదర్శి గంగాధర్, ఉప సర్పంచ్ మొల్లేటి దేవీ, పెద్దలు పాల్గొన్నారు.

అందని ద్రాక్షలా

కళాశాల విద్య..!



ఇంటర్ తరగతి గదిలో అంతంత మాత్రంగా ఉన్న విద్యార్థులు



లాలం కోడూరు సమీపంలోని హైస్కూల్‌లో కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల

- మండల కేంద్రం రాంబిల్లికి దూరంగా జూనియర్ కళాశాల ఏర్పాటు
- టీడీపీ హయాంలో రాజకీయ స్వార్థంతో లాలం కోడూరుకు తరలింపు
- రవాణా సౌకర్యం లేక అంతంత మాత్రంగా ప్రవేశాలు
- ఏళ్ల తరబడి హైస్కూల్ భవనంలోనే తరగతుల నిర్వహణ
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పలు అభివృద్ధి పనులు

రాంబిల్లి(యలమంచిలి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొందరు నేతల స్వార్థంతో కళాశాల విద్య అందని ద్రాక్షలా మారింది. మండలం పరిధిలో కళాశాల ఉన్నా విద్యార్థులు చేరలేని పరిస్థితి నెలకొంది. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం రాంబిల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను లాలం కోడూరు గ్రామానికి తరలించుకుపోవడమే ఇందుకు కారణం. మండల కేంద్రంకు దూరంగా.. జన సంచారం తక్కువగా ఉన్న ఎస్‌ఈజెడ్ ఫార్మా పరిశ్రమల సమీపంలో ప్రభుత్వ కళాశాల ఉండడంతో విద్యార్థుల ప్రవేశాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. మరోవైపు కళాశాల ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా స్థానిక లాలం కోడూరు హైస్కూల్ భవనంలో పైఉన్న మూడు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తూ నెట్టుకొస్తున్నారు. తరగతి గదుల్లోనే ఓ మూలన అరకొర వసతులతో ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య పెరగాల్సింది పోయి తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి ప్రధాన కారణం రాంబిల్లి మండల కేంద్రంకు దూరంగా ఉండటం, కళాశాలకు ట్రాన్స్‌పోర్టు సౌకర్యం లేకపోవడమేనని పలువురు భావిస్తున్నారు. మరోవైపు గెస్ట్ ఫ్యాకల్టీ, కాంట్రాక్ట్ లెక్చరర్లతో బోధన చేస్తుండడం కూడా విద్యార్థుల ప్రవేశాలపై ప్రభావం చూపిస్తోంది. ఫలితంగా అచ్యుతాపురం, యలమంచిలి, అనకాపల్లిలో ఉన్న ప్రైవేట్ కళాశాలల్లో ఎక్కువగా విద్యార్థులు చేరిపోతున్నారు.

జీతాలు లేక అధ్యాపకుల అవస్థలు

గతేడాది కాలంగా ఇక్కడ పని చేస్తున్న 10 మంది గెస్ట్ ఫ్యాకల్టీ, ఒక కాంట్రాక్ట్ లెక్చరర్‌కు జీతాలు రాక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ కళాశాలలో 36 మంది విద్యార్థులు చదువుతున్నారు. దుంబ్రిగుడ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన వారానికి రెండు రోజులు ఇక్కడ సేవలందిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఇక్కడ కళాశాలలో నాడు–నేడు పథకంలో భాగంలో విద్యార్థులకు మరుగుదొడ్లు, బెంచీలు, డిజిటల్ బోర్డులు మంజూరుతో పాటు పలు సదుపాయాలు కల్పించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ కళాశాలను మండల కేంద్రం రాంబిల్లిలో ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.



తరగతి గదిలో ఒక మూలన ఉన్న ప్రయోగశాల పరికరాలు

రాంబిల్లిలో ఉంటే ప్రయోజనకరం



రాంబిల్లి మండల కేంద్రంలో కళాశాల ఉండాలి. కాని కొందరు రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం, ప్రైవేట్ కళాశాలలను ప్రోత్సాహించడానికి జనవాసాలకు దూరంగా రవాణా సౌకర్యం లేని లాలం కోడూరులో ఏర్పాటు చేశారు. ఆడపిల్లలు కళాశాలకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. కళాశాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. ఆటోలు, రిక్షాలు కూడా అటువైపు వెళ్లని పరిస్థితి ఉంది.

– జి.దేముడునాయుడు, సీపీఎం రాంబిల్లి మండల కార్యదర్శి

కళాశాల ఉన్నట్టు తెలియదు



రాంబిల్లి మండలంలో ప్రభుత్వ కళాశాల ఉన్నట్టు చాలా మందికి తెలియదు. మండలంలో వెంకటాపురం సమీపంలో ఏర్పాటు చేయాల్సిన కళాశాలను అప్పటి టీడీపీ నాయకులు లాలంకోడూరుకు తరలించుకుపోయారు. కొందరు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు రాజకీయ ఒత్తిళ్లు తీసుకురావడంతో ఇలా జరిగింది. వెంకటాపురంలో ఏర్పాటు చేసి ఉంటే రవాణా సౌకర్యం ఉండేది. మండలంలో చాలా గ్రామాలకు ఈ కళాశాల అందుబాటులో లేకుండా పోయింది.

– సారిపిల్లి పైడిరాజు, వెంకటాపురం గ్రామం

కళాశాల అభివృద్ధికి కృషి

ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా ప్రతి ఏడాది ప్రచారం చేస్తున్నాం. గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్లకు గత సంవత్సరం కాలం నుంచి జీతాలు ప్రభుత్వం నుంచి రావడం లేదు. అయినా వారితో సర్దుబాటు చేసి తరగతులు నిర్వహిస్తున్నాం. నాడు–నేడు పథకం కింద కళాశాలలో మరుగుదొడ్లు, తరగతి గదుల్లో బెంచీలు, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశాం. కళాశాల మండల కేంద్రానికి దూరంగా ఉండటం వాస్తవమే. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గ్రహించి మండల కేంద్రం నుంచి కళాశాల మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరాం. ప్రస్తుతం బస్సు సౌకర్యం ఉంది.

– సోమునాయుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, లాలం కోడూరు కళాశాల

ఫార్మా కాలుష్యంతో అవస్థలు



లాలంకోడూరులో ఉన్న ఈ కళాశాలకు దగ్గరగా ఫార్మా పరిశ్రమలు ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఫార్మా కాలుష్యం బారిన పడే ప్రమాదం ఉంది. కళాశాలకు వెళ్లే మార్గం తుప్పలతో భయంకరంగా ఉంటోంది. అందరికీ అందుబాటులో ఉండేలా కళాశాల ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ధూళి సత్యయాదవ్, భోగాపురం గ్రామం

గజ వాహనంపై గోవిందుడు



గజ వాహనంపై స్వామివారికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాకలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా స్వామివారికి రోజుకొక వాహనంపై తిరువీధి నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం కల్కి అవతారంలో వెలసిన స్వామివారికి పంచామృతాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. కొండదిగువ ఉత్సవమూర్తులకు క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, గోదాదేవి అమ్మవారికి నిత్యపూజలు చేశారు. అనంతరం ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని గజ వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి ఊరేగించారు. శ్రీదేవీ, భూదేవీ సమేతంగా స్వామివారు తమ చెంతకు తిరువీధి సేవల కోసం వస్తుండడంతో భక్తులు పసుపు, కుంకుమలు, కానుకలు సమర్పించారు. అనంతరం గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పాశురం విన్నపం చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు దేముడునాయుడు, తదితరులు

రాంబిల్లి(యలమంచిలి): అల్లూరి సీతారామరాజు విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం రాంబిల్లి మండల కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఎస్.రాయవరం మండలం లింగరాజుపాలెం గ్రామంలోని అల్లూరి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడంపై రాంబిల్లి మండలంలో పార్టీ నాయకులతో కలసి శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.రాంబాబు, వై.రాము, వై.రాజేశ్వరి, సిహెచ్.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు



కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న నాయకులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు కార్మిక శాఖ జారీ చేసిన గుర్తింపు కార్డులను సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అల్లాడ కొండబాబు, కొల్నాటి తాతాజీ శుక్రవారం అందజేశారు. కార్మిక శాఖ తరఫున అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్ని భవన నిర్మాణ కార్మికులకు వర్తింపజేయాలని వారు కోరారు. ప్రభుత్వం జారీ చేసిన ఈ గుర్తింపు కార్డులు ప్రతి ఏటా కార్మికులు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ప్రమాదవశాత్తూ మరణించిన కార్మికుడికి ప్రభుత్వం రూ.10 లక్షలు బీమా సదుపాయం కల్పిస్తుందన్నారు. కార్మిక కుటుంబాల్లో ఆడ పిల్లల వివాహాలకు, మొదటి, రెండో కాన్పులకు కూడా ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. కార్మికులు కార్మిక శాఖ అధికారిని సంప్రదించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు



పాటిపల్లి సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని పాటిపల్లి రామాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో శుక్రవారం ఆయన రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూములకు సంబంధించి రైతుల మధ్య వివాదాలు లేకుండా వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇటువంటి సదస్సుల ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. సర్పంచ్ ఆడారి కృష్ణవేణి, రీ–సర్వే డీటీ పడాల్, పంచాయతీ కార్యదర్శి రాజు, వీఆర్వో సింహాచలం, వైఎస్సార్‌సీపీ నేత ఆడారి త్రిమూర్తులు, వార్డు సభ్యులు ఆడారి లీలా, చిందాడ అప్పారావు, తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పడు మృతికి సంతాపం



మోసయ్యపేటలో అప్పడు అంత్యక్రియలకు హాజరైన జనం

అచ్యుతాపురం: మండలంలోని మోసయ్యపేట సర్పంచ్ పైడిరాజు తండ్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పడు(60) మృతికి పలువురు సంతాపం తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ కలాసీ మేస్త్రిగా సేవలందించిన ఆయన గురువారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీంతో అప్పడును ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. మోసయ్యపేట పరిసర ప్రాంతాల్లో ఎన్నో వివాదాలను పెద్దరికంతో పరిష్కరించిన అప్పడు మృతిని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. అప్పడు అంత్యక్రియలు శుక్రవారం భారీ జనసందోహం మధ్య పూర్తయ్యాయి.

అరబుపాలెంలో నేడు 'మన ఊరు–మన బాధ్యత'

మునగపాక: మండలంలోని అరబుపాలెంలో శనివారం మన ఊరు–మన బాధ్యత కార్యక్రమం నిర్వహించనున్నట్టు ముసిలితల్లి అమ్మవారి ఉత్సవ కమిటీ చైర్మన్ కొయిలాడ గంగాధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక రామాలయంలో గ్రామపెద్దలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బొడ్డేడ అచ్చియ్యనాయుడు ఆశయ సాధనలో భాగంగా ఊరిని అభివృద్ధి చేసుకునేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డేడ హైమావతి పాల్గొన్నారు.

పాములవాకలో మేలుకొలుపు



రామాలయంలో సంకీర్తన చేస్తున్న భక్తులు

కోటవురట్ల: పాములవాకలో శుక్రవారం మేలుకొలుపు నిర్వహించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి వీధుల్లో సంకీర్తన చేశారు. భజన చేస్తూ భక్తి గీతాలు ఆలపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు కోరారు. మండలంలోని తోటాడలో శుక్రవారం ఏర్పాటు చేసిన 104 సేవలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వైద్యుల సలహాల మేరకు ప్రజలు నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాములవాకలో చేతిబోరుకు శంకుస్థాపన

కోటవురట్ల: పాములవాకలోని సూరెడ్డి వారి గరువులో శుక్రవారం బోరు పనులను ప్రారంభించారు. మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి పనులకు శంకుస్థాపన చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల మకాములలో మంచినీటి సమస్య ఉండడంతో గతంలో పలు దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. అవసరమైన చోట్ల జెడ్పీటీసీ నిధుల, పంచాయతీ నిధులతో బోర్లు కోయిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు సూరెడ్డి నూకరాజు, సూరెడ్డి సత్తిబాబు, సూరెడ్డి రమణ, సూరెడ్డి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రాంబిల్లి(యలమంచిలి): పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు రాంబిల్లి ఎస్‌ఐ నాగేంద్ర శుక్రవారం తెలిపారు. రాంబిల్లి మండలం గోవిందపాలెం సమీపంలో గురువారం రాత్రి ఓ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఏడుగుర్ని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.49 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

మునగపాక: పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంఈవో వేణుగోపాలరావు కోరారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పీఎంసీ కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో–2 శివనాయుడు, పలువురు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని కాకరాపల్లి రామాలయం వద్ద శనివారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి



ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో సావిత్రి బాయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పంచదార్ల హైస్కూల్‌లో సావిత్రిబాయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పి.ధర్మవరం పాఠశాలలో సావిత్రిబాయి చిత్ర పటం వద్ద అంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు



పాములవాకలో సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అచ్యుతాపురం: భారత్‌లో తొలి మహిళా గురువుగా, సామాజిక సంస్కర్తగా సావిత్రి బాయి పూలే చేసిన సేవలు మరువలేనివని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయిని శ్రీలక్ష్మి అన్నారు. అచ్యుతాపురంలోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో శుక్రవారం సావిత్రి బాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ దేశంలో మహిళా విద్య ఉద్యమానికి నాంది పలికిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మద్దెల నానాజీ, ప్రధాన కార్యదర్శి సుభాషిణి దేవి, మహిమ రావు, సూర్యలక్ష్మి, అరుణ, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మారిసెట్టి వెంకట అప్పారావు, పాఠశాల ప్రిన్సిపాల్ మధు పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం పంచదార్ల హైస్కూల్‌లో సావిత్రిబాయిపూలే చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా జాయింట్ సెక్రటరీ సిహెచ్.మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మహిళల హక్కుల పట్ల అలుపెరగని పోరాటం చేసిన సావిత్రిబాయిపూలే సేవలు మరువలేనివని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 సత్తిబాబు, ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వి.అచ్యుతరావు, ఉపాధ్యాయులు వరప్రసాద్, దేముడు, రామారావు, సుజాత, వసుంధర, రామలక్ష్మి, దేవి, ఉమాదేవి, కుమార్ పాల్గొన్నారు.

వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ చికిత్సలు



శునకానికి శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యుడు

యలమంచిలి రూరల్: పట్టణంలో ప్రజలను హడలెత్తిస్తున్న వీధి కుక్కల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు ప్రారంభించారు. విపరీతంగా పెరిగిపోయిన వీధి కుక్కల సంఖ్యను అదుపు చేసేందుకు గర్భధారణ నియంత్రణ శస్త్ర చికిత్సలు శుక్రవారం నిర్వహించారు. స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో ప్రత్యేకంగా శస్త్ర చికిత్సల కోసం ప్రత్యేక గదితో పాటు, సర్జరీ తర్వాత కుక్కల సంరక్షణకు ప్రత్యేక వసతి నిమిత్తం ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. శుక్రవారం పట్టణంలోని పలు వీధుల్లో శునకాలను మున్సిపల్ సిబ్బంది పట్టుకుని, వాటిని ప్రత్యేక వాహనంలో పశువైద్యశాలకు తరలించారు. తర్వాత వాటికి సర్జరీలు నిర్వహించారు. తొలిరోజు 10 శునకాలకు ఆపరేషన్లు పూర్తి చేశారు. సర్జరీ తర్వాత వాటికి ఏఆర్వీ వ్యాక్సిన్, యాంటీ బయోటిక్ మందులు ఇచ్చారు. జంతు నియంత్రణ నిబంధనలు–2023 ప్రకారం వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్సలు చేసేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్టు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తెలిపారు.